కమలానగర్‌లో కూలిన భారీ రావి చెట్టు



రావి చెట్టు కూలడంతో ప్రహరీతో పాటు పక్కనే పార్క్ చేసిన కారు ధ్వంసమైన దృశ్యం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గాలి.. వర్షం దాటికి మంగళవారం సాయంత్రం గడ్డిఅన్నారంలోని కమలానగర్ రోడ్ నంబర్ 5లో భారీ రావి చెట్టు కూలింది. దీంతో పక్కనే ఉన్న గోడ కూలి అక్కడే పార్క్ చేసి ఉన్న కారుపై పడడంతో ధ్వంసమైంది. మూతపడిన పురాతన రైస్ మిల్ గోడౌన్‌లో ఐఏసీఈ ఇనిస్టిట్యూట్ నిర్వహిస్తున్నారు. సుమారు 2వేల మంది విద్యార్థులు ఈ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్నారు. భారీ రావి చెట్టు కూలిన సమయంలో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో ఇనిస్టిట్యూట్‌లో ఉన్న విద్యార్థులతో పాటు స్థానికులు బయటికి పరుగులు తీశారు. ఒకదశలో ఎక్కడ ఏం జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఘటన వల్ల ఎవరికి ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

వనస్థలిపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎస్కేడినగర్‌లోని శ్రీలక్ష్మీనర్సింహ్మా స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు కార్పొరేటర్ లచ్చిరెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'మానసిక దివ్యాంగులకు లబ్ధి చేకూరాలి'

సైదాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగులకు అన్ని విధాలుగా లబ్ధి చేకూరాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. సింగరేణికాలనీలోని ఆత్మీయ మానసిక వికాస కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్, ఆర్టీసీ డిపో మేనేజర్ కృష్ణారెడ్డి విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను అందజేశారు. ప్రభుత్వ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల దశరథ్‌గౌడ్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

మన్సూరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కాలనీలో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని శానిటేషన్ సిబ్బందికి మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని చిత్రసీమ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయాలని సూచించారు. డ్రైనేజీ పైప్‌లైన్ పనుల్లో నాణ్యత లోపించకుండా హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. కుంగిన విద్యుత్ స్తంభాలను తొలగించడం లేదా మరమ్మతులు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు డీవీ రమణ, జేజే రెడ్డి, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఆలే చంద్రశేఖర్, మల్లికార్జున్‌రెడ్డి, రామ్‌గోపాల్, వెంకట్‌రెడ్డి, అశోక్, బాలరాజు, బిక్షపతి, శానిటేషన్ సిబ్బంది జవాన్ శ్రీనివాసరావు, లక్ష్మణ్, బీజేపీ నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు

కొత్తపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కొత్తపేట రాఘవేంద్ర కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన కాలనీలో పర్యటించారు. రూ.42 లక్షల వ్యయంతో కాలనీ రోడ్ నెం.7 నుంచి రోడ్ నెం. 2 వరకు చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడ ఇదివరకు ఉన్న 400 ఎంఎం పైప్‌లైన్‌ను తొలగించి, ఎక్కువ సామర్థ్యం గల 900 డయా పైప్‌లైన్ వేస్తున్నారని తెలిపారు. పనులను పర్యవేక్షించాలని, నాణ్యత పాటించేలా చూడాలని జీహెచ్ఎంసీ ఏఈ షరీఫ్‌ను కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రామకృష్ణగౌడ్, ప్రతినిధులు లింగయ్య, రామదాసు, సంజీవ్, బీజేపీ మోర్చా అధ్యక్షులు గట్టు మహేష్‌కుమార్, నాయకులు అశ్విన్‌సింగ్, వెంకట్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట విలేజీలో పారిశుధ్య పనులు

కొత్తపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గావ్ చలో - బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు మంగళవారం కొత్తపేట విలేజీలోని భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పార్టీ రాష్ట్ర నాయకులు బొల్లం యశ్పాల్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు బద్రి అశోక్‌గౌడ్ ఇంట్లో అల్పాహారం తిన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో పనిచేసిన స్థానిక నాయకులు భాస్కర్‌గౌడ్, రాజేందర్, ముఖేష్‌గౌడ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో యువమోర్చా అధ్యక్షులు ప్రసాదం కిరణ్, నాయకులు రాచకొండ రాధిక, వినోద్, సంధ్య, లక్ష్మమ్మ, మాధవి, ఝాన్సీ, రాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చిక్కుళ్ల శివప్రసాద్ నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మంగళవారం శివప్రసాద్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఇంతియాజ్ గుల్షన్, సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తాండ్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఉపేందర్‌శర్మ, లావణ్య తదితరులు

అర్చక, ఉద్యోగులు ఆరాధన భావంతో పని చేయాలి

చంపాపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దేవాలయాలలో పని చేస్తున్న అర్చక, ఉద్యోగులు ఐకమత్యంతో ఆరాధన భావంతో పని చేయాలని తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేందర్‌శర్మ అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంను మంగళవారం ఆయన సందర్శించారు. ఆలయంలోని శ్రీ ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ఉపేందర్‌శర్మ, ఆలయ ఈవో ఎన్.లావణ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. ఉపేందర్‌శర్మకు ఆలయ ఈవో లావణ్య స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం జేఏసీ నూతన ఉగాది టూ ఉగాది డైరీని ఈవో ఎన్. లావణ్యతో కలిసి ఉపేందర్‌శర్మ, అర్చక, ఉద్యోగ రాష్ట్ర జేఏసీ గౌరవసలహాదారు కుర్మేటి అంబాప్రసాద్‌శర్మ, ఉపాధ్యక్షులు కంధాళ సంతోష్‌కుమారా చార్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటయ్య, రమాదేవి, వేద పండితులు, చంద్రకాంత్‌శర్మ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రభుత్వ విద్యార్థుల హవా

సరూర్‌నగర్ ప్రభుత్వ కళాశాలలో..



తహసీన్ బైపీసీ 978



ధార్తి ఎంపీసీ 950

ఎల్బీనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరంలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 98 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 179 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 110 మంది ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలో 61.11% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని మదీహ తహసీన్ 978/1000 మార్కులతో, ఎంపీసీలో పి.దార్తి 950/1000 మార్కులతో, సీఈసీలో జే.స్వప్న 856/1000 మార్కులతో, హెచ్ఈసీలో ఈ.జ్యోతి 686/1000 మార్కులతో, ఏ అండ్ టీలో వి.శ్వేత 899/1000 మార్కులతో కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

నాదర్‌గుల్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ జూనియర్ కాలేజీలో



కె.రణిత్ సీఈసీ 966



శివసాయి హెచ్ఈసీ 965



రాఘవేంద్ర హెచ్ఈసీ 961

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ జూనియర్ కాలేజీ(కందుకూరు) విద్యార్థులు సత్తాచాటారు. ఈ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉండగా, రెండో సంవత్సరం ఎంపీసీలో 32 మంది విద్యార్థులకుగాను 24 మంది(75%) ఉత్తీర్ణులయ్యారు. సిద్ధార్థ 922 మార్కులు సాధించి కాలేజీ టాపర్‌గా నిలిచారు. బైపీసీ సెకండియర్‌లో 24మంది పరీక్షలు రాయగా 17 మంది(72%) పాసయ్యారు. వరుణ్ కార్తీక్ 861 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలిచాడు. ఎంపీసీ ఫస్టియర్‌లో 21మంది విద్యార్థులకుగాను 16 మంది(73%), బైపీసీలో 15మందికిగాను 9మంది(60%) ఉత్తీర్ణులయ్యారు.

మీర్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..

ఇంటర్మీడియేట్ పరీక్షల ఫలితాల్లో మీర్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఓవరాల్‌గా కళాశాల ఉత్తీర్ణత శాతం తక్కువగానే ఉన్నప్పటికీ.. ఇక్కడ బైపీసీ గ్రూపునకు చెందిన వైశాలి వేయి మార్కులకుగాను 948 మార్కులు సాధించారు. ఈ కాలేజీ నుంచి ఫస్టియర్ పరీక్షలకు 188 మంది హాజరవ్వగా వారిలో 81 మంది(43శాతం) పాసయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం ఇంటర్‌లో 111 మంది పరీక్షలు రాయగా 51 మంది(46శాతం) ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం ఇంటర్ ఎంపీసీలో జి.సాకేత్ 908 మార్కులు సాధించి కాలేజీ టాపర్‌గా నిలువగా, 899 మార్కులతో సీహెచ్ బాలవర్ధన్ ద్వితీయ స్థానం దక్కించుకున్నాడు. ఇక బైపీసీలో ఎం.వైశాలి 948 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలువగా, 746 మార్కులతో కె.ప్రియాంక రెండో స్థానం దక్కించుకుంది. సీఈసీలో 708 మార్కులతో టి.ఐశ్వర్య ప్రథమ స్థానం, 684 మార్కులతో డి.వైష్ణవి ద్వితీయ స్థానం సాధించగా, ఎంఎల్‌టీలో వై.అభిలాష్ 817 మార్కులతో మొదటి స్థానం, 815 మార్కులతో వి.దివ్య ద్వితీయ స్థానం దక్కించుకున్నారు.

బైపీసీలో ఆటో డ్రైవర్ కూతురికి 948 మార్కులు

మీర్‌పేట్ కాలేజీలో బైపీసీ టాపర్‌గా నిలిచిన వైశాలి (948) పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని. జిల్లెలగూడలోని కమలానగర్ కాలనీకి చెందిన వైశాలి తల్లి ఇళ్లలో పని చేస్తుండగా, తండ్రి ఎం.యాదగిరి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయినప్పటికీ తమ కూతురికి ఏ పనీ చెప్పకుండా చదువుకొమ్మని ప్రోత్సహించారు. దాంతో వైశాలి కాలేజీ టాపర్‌గా నిలిచింది. ఈ నెల 29న ఎంసెట్, మే 4న నీట్ పరీక్ష రాయడానికి ఇంట్లోనే ప్రిపేర్ అవుతున్నానని, ఎందులో మంచి ర్యాంకు వస్తే అందులో చేరి ఉన్నత విద్య అభ్యసిస్తానని వైశాలి తెలిపారు. ప్రభుత్వం తమలాంటి పేద విద్యార్థులకు అన్ని విధాలుగా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

హయత్‌నగర్ ప్రభుత్వ కళాశాలలో..



రెహానా ఎంపీసీ 970



గణేష్ ఎంపీసీ 930

హయత్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్ష ఫలితాలలో హయత్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 156 మందికి గాను 65 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన షేక్ రెహానాకు 970/1000 మార్కులు లభించాయి. రెహానా తండ్రి కూలీ పని చేస్తూ చదివిస్తున్నాడు. గణేష్‌కు 930/1000, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన బీస్మాకు 905/1000, బైపీసీకి చెందిన శ్రీలక్ష్మికి 919/1000, బైపీసీకి చెందిన హరితేజకు 907/1000 మార్కులు సాధించారు.

మలక్‌పేట ప్రభుత్వ కళాశాలలో



సుస్మిత ఎంపీసీలో 985



శృతి సీఈసీలో 958



జుబీస్నీసా బైపీసీలో430



శివాత్మిక ఎంపీసీలో451

సైదాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట న్యూ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాల ప్రతిష్ఠను ఇనుమిడింపజేశారు. కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరం 203విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 81 మంది(40%) ఉతీర్ణులయ్యారు. రెండో సంవత్సరం 194 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 109 మంది(56%) ఉతీర్ణులయ్యారు. ఎంపీసీలో టాపర్‌గా జి.సుస్మిత 985/1000 మార్కులు, సీఈసీలో కత్తుల శృతి 958 బైపీసీలో తిరున్నీసాకు 944/1000 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో శివాత్మికకు 451/470, బైపీసీలో బీస్నీసాకు 430/440, సీఈసీలో ఇందు445/500 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ జి.అరుణ, లెక్చరర్లు హర్షం వ్యక్తం చేశారు.

సెక్యూరిటీగార్డు కూతురికి ఎంపీసీలో 985 మార్కులు

ప్రైవేటు సెక్యూరిటీ గార్డు కూతురు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటింది. మలక్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సుస్మిత ఎంపీసీలో 985 మార్కులతో అదరగొట్టింది. తండ్రి నర్సింహ నగరంలో ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలో సెక్యూరిటీగార్డుగా పని చేస్తున్నారు. ఇంజనీర్ కావాలన్నదే తన ముందున్న లక్ష్యమని సుస్మిత తెలిపారు.

మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థుల సత్తా

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగర శివారు బాటసింగారంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల కళాశాల(సీఓఈ క్యాంపస్) విద్యార్థులు మంగళవారం విడుదల అయిన ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఇంటర్ రెండవ సంవత్సరంలో 162 మంది విద్యార్థులకు గాను 155 మంది విద్యార్థులు (96%) పాస్ కాగా, మొదటి సంవత్సరంలో 204 మంది విద్యార్థులకు 203 మంది విద్యార్థులు (99.56%) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న డి. తరుణ్ 992 (ఎంపీసీ) మార్కులు సాధించగా, సీహెచ్ సాయిప్రసన్నకుమార్ 991((ఎంపీసీ), శశికుమార్ 990(ఎంపీసీ), ఆషీద్ 990(ఎంపీసీ), ఆర్. రాజ్‌కుమార్ 990(ఎంపీసీ), ఎస్. అభిలాష్ 986 (బీపీసీ) మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఆర్. కౌషిక్ 467 (ఎంపీసీ) మార్కులు, బి. మధు 467(ఎంపీసీ), బి. మల్లేష్ 467 (ఎంపీసీ), కే. శ్రావన్‌కుమార్ 433(బీపీసీ) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



తరుణ్ ఎంపీసీ 992



సాయిప్రసన్న ఎంపీసీ 991



శశికుమార్ ఎంపీసీ 991









కౌశిక్ 467, మధు 467, మల్లేష్ 467, శ్రావణ్‌కుమార్ 433 (బైపీసీ)

బైపీసీలో ఇస్లావత్ పల్లవికి 995 మార్కులు



పల్లవి బైపీసీ 995

వనస్థలిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో భాగంగా బీఎన్ రెడ్డినగర్ డివిజన్ సిరిపురం కాలనీలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలకు చెందిన ఇస్లావత్ పల్లవి బైపీసీ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 1000 మార్కులకు గాను 995 సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా ఆగమనగల్లు మేడిగడ్డ తండాకు చెందిన ఇస్లావత్ జానునాయక్, పుష్ప దంపతుల మూడో సంతానం అయిన ఇస్లావత్ పల్లవి బైపీసీలో స్టేట్ లెవల్‌లో ప్రథమ స్థానాన్ని సాధించడంతో కళాశాలలో ఘనంగా సంబురాలు నిర్వహించారు.

ఎంపీసీలో తన్వికి 992 మార్కులు



తన్వి ఎంపీసీ 992

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సెల్ఫ్‌ఫైనాన్స్ కాలనీకి చెందిన సురాపూర్ వినయ్, లావణ్య దంపతుల కుమార్తె సురాపూర్ తన్వి ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 992 సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకును సాధించారు.

గదులు.. ఉపాధ్యాయుల కొరత తీరుస్తాం

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి



పాఠశాలలో స్థానికులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని రాగన్నగూడ జిల్లా పరిషత్ పాఠశాలకు గదులు, ఉపాధ్యాయుల కొరత తీరుస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం రాగన్నగూడ జిల్లా పరిషత్ పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులు, 4 తరగతి గదులు, ప్రైమరీ స్కూల్‌కు ఇద్దరు ఉపాధ్యాయులు 1 తరగతి గది అవసరం ఉందని ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంట గదిని మర్చడం వల్ల అక్కడ కొత్త భవనాన్ని నిర్మిస్తామని అన్నారు. అందుకు తగిన నిధులు మంజూరు చేయాలని ఆయన డీఈవో సుశీందర్‌రావును ఆదేశించారు. అవసరమైన మేరకు ఉపాధ్యాయులను నియమించాలని డీఈవోను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, డీఈవో సుశీందర్‌రావు, ఎంఈవో జగదీశ్వర్, నాయకులు పూజారి శంకరయ్యగౌడ్, సామ భీంరెడ్డి, మంగమ్మ, కౌశిక ఐలయ్య, కుంట గోపాల్‌రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, కొంతం వెంకట్‌రెడ్డి, యాదగిరితో పాటు పలువురు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి: భాస్కర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర మంగళవారం ఆర్‌కేపురం డివిజన్‌లో పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవహేళన చేస్తోందని మండిపడ్డారు. గాంధీ, అంబేడ్కర్‌లు సూచించిన అహింసా విధానంతో రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తుందన్నారు. ఈ సందర్భంగా దేప భాస్కర్‌రెడ్డి, భార్గవ్ రామ్ కలిసి యాత్రలో పాల్గొన్న వారితో రాజ్యాంగ పరిరక్షణకై ప్రతిజ్ఞ చేయించారు. ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, అల్లేటి కిరణ్‌కుమార్, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ రమేష్‌నేత, యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌యాదవ్, లింగస్వామిగౌడ్, రాజునాయక్, గోదా కళ్యాణ్, ఖిల్లా మైసమ్మ ఆలయ చైర్మన్ సురేష్, డైరెక్టర్ సుజాత, నబీ, మహ్మద్, ప్రేమ్‌నాయక్, మహ్మద్ రఫీ, భూపాల్‌రెడ్డి, సైదులు, మహేందర్, కవిత, శ్వేత, లావణ్య, రేణుక, మాధవి, జహంగీర్, జెల్లా జగన్నాథం పాల్గొన్నారు.

జిల్లెలగూడలో..

సరూర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ అంబేడ్కర్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ బైగల్ల బాలమణి ఆధ్వర్యంలో మంగళవారం జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. టఫ్ఐడీసీ చైర్మన్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాలనీలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌లను ఆదర్శంగా తీసుకుని రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, మీర్‌పేట్ ఇన్‌చార్జి నరేందర్, మాజీ కార్పొరేటర్లు చల్లా కవితాబాల్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మీర్‌పేట్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ, అంబేడ్కర్‌నగర్ కాలనీ అధ్యక్షుడు ఓంప్రకాశ్, ప్రతినిధులు భిక్షపతి, యాదయ్య, వెంకటేశ్, కుమార్, సంతోష్, నాయకులు పాల్గొన్నారు.


తప్పుడు బిల్లులతో సీఎంఆర్‌ఎఫ్ నిధులు పొందిన మూడు ఆస్పత్రులు సీజ్

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తప్పుడు మెడికల్ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ నిధులను పొందిన మూడు ప్రైవేటు ఆస్పత్రులను వైద్యఆరోగ్య శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం సరూర్‌నగర్ మండలం పరిధిలోని హిరణ్య, ఎంఎంఎస్, ఇందిరా ఆస్పత్రులను ఆయన సీజ్ చేశారు. అనంతరం సరూర్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదారు సంవత్సరాలుగా జిల్లాలోని కొన్ని ఆస్పత్రులు తప్పుడు బిల్లులు సృష్టించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా లబ్ధి పొందినట్లు సీఐడీ ప్రత్యేక దర్యాప్తులో తేలడంతో ప్రభుత్వం చర్యలకు ఆదేశించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యఆరోగ్య సంచాలకులు ఆయా ఆస్పత్రులను మూసివేయాలని ఆదేశించారని తెలిపారు. వాటిలో హస్తినాపురంలోని డెల్టా ఆస్పత్రి, బీఎన్‌రెడ్డినగర్‌లోని శ్రీరక్షా ఆస్పత్రి, సాగర్ రింగ్ రోడ్‌లోని హిరణ్య ఆస్పత్రి, సాగర్ రోడ్‌లోని మోహన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, సాయితిరుమల ఆస్పత్రి, సరూర్‌నగర్‌లోని ఎంఎంవీ ఇందిరా ఆస్పత్రులు ఉన్నాయని తెలిపారు. వాటిలో ఇప్పటికే కొన్ని ఆస్పత్రులు మూతపడ్డాయని ఆయన చెప్పారు. మిగిలిన మూడు ఆస్పత్రులను మంగళవారం సీజ్ చేశామని తెలిపారు. సరూర్‌నగర్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌ను కూడా మూసివేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూనమ్, సరూర్‌నగర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగ్గురు హిజ్రాల అరెస్ట్

హయత్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు కాలనీ అనన్య రెస్టారెంటు, క్రీడా ప్రహరీ, పెద్దఅంబర్‌పేట్ ఔటర్‌రింగు రోడ్డు వద్ద రాత్రి వేళల్లో రోడ్లపైన నిలబడి అసాంఘిక కార్యకలాపాలకు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో సోమవారం రాత్రి ముగ్గురు హిజ్రాలను హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు మంగళవారం ఉదయం హిజ్రాలను అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజుగౌడ్ మాట్లాడుతూ ఇకనుంచి ఎవరైనా రాత్రి వేళల్లో రోడ్లవెంట నిలబడి అసాంఘీక కార్యకలాపాలకు, అక్రమ వసూళ్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాటసింగారం దేశ్‌ముఖ్ రోడ్డులో సుమారు 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనారోగ్య సమస్యలతో అతడు మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు భూభారతిపై అవగాహన సమావేశం

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు సరూర్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

బాలాపూర్‌లో..

సరూర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై అవగాహన కల్పించే నిమిత్తం బుధవారం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మునిసిపాలిటీకి చెందిన రైతులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ ఇందిరాదేవి తెలిపారు. బడంగ్‌పేట్ మునిసిపల్ భవనంలోని మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు ఈ సమావేశం ఉంటుందని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ నారాయణరెడ్డి హాజరవుతారని ఆమె చెప్పారు.

'భూమి.. జీవరాశులను రక్షించుకుందాం'

వనస్థలిపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భూమిని కాపాడుకుందాం.. భూమిపైన ఉన్న జీవరాశులను రక్షించుకుందామని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో బీఎన్ రెడ్డినగర్ డివిజన్ శ్రీ వెంకటేశ్వర కాలనీలో విద్యార్థులతో కలిసి ఇంటింటికి బొట్టుపెట్టి ధరిత్రిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఇస్మాయిల్ గురుజీ, సంధ్యారాణి, కృష్ణ, శిరిష, నరేందర్ గురుజీ, రామాలింగేశ్వర రావు పాల్గొన్నారు.

లెనిన్‌కు సీపీఐ నేతల నివాళి

హయత్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సోవియట్ యూనియన్ వ్యవస్థాపకుడు లెనిన్ 155వ జయంతి వేడుకలను సీపీఐ నాయకులు మంగళవారం హయత్‌నగర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి శ్రీదేవి హాజరై లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్‌గౌడ్, వంశీవర్ధన్ రెడ్డి, సరిత, రాములు, రాజు, మమత, ముత్తయ్య పాల్గొన్నారు.

నిషేధిత సిగరెట్లు అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

వనస్థలిపురం, ఏప్రిల్ 22(ఆంధ్ర జ్యోతి): నిషేదిత సిగరెట్లు అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం హుడా కాంప్లెక్స్‌లోని పూర్ణిమ ట్రేడర్స్ కాంప్లెక్స్‌లో ప్రభుత్వం నిషేదించిన సిగరెట్లను ఇదే కాలనీకి చెందిన సోమిశెట్టి పుల్లయ్య(67) అమ్ముతున్నాడని అందిన సమాచారం మేరకు పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేయగ ప్రభుత్వం నిషేదించిన ఆరు రకాల సిగరెట్ బెండల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిగరెట్లను గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న సదరు వ్యాపారి పుల్లయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై సరూర్‌నగర్ పోలీసులు, ఎల్బీనగర్ పోలీసులు కలిసి మంగళవారం దాడి చేశారు. కొత్తపేట హుడా కాలనీలో జరిపిన ఈ దాడిలో ఇద్దరు నిర్వాహకులను మరో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి ఏడు సెల్ ఫోన్లు రూ.5330ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరూర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.